



చలి.. చలి..!



- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- రాత్రిళ్లు 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత
- సాయంత్రం నుంచే చలి ప్రారంభం
- వణికిపోతున్న జనం

వాతావరణం ఒక్కసారిగా మారింది. గత వారం రోజులుగా వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరు దాటగానే చలిపంజా విసురుతోంది. ఉదయం 8 గంటల వరకు మంచు దుప్పటి కప్పేస్తోంది. తుపాన్ ప్రభావంతో మంగళవారం నాడు ఉదయం నుంచి సాయంత్రం వరకు చలి తీవ్రత కొనసాగింది. మబ్బులు పట్టేయడంతో సూర్యకిరణాలు నేలతాకలేదు. దీంతో చలి పెరిగి జనం వణికిపోయారు. సాధారణంగా నవంబర్ మొదటి, రెండవ వారాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తాయి. ఈ సారి మాత్రం అక్టోబర్ చివరి వారంలో 17 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గడిచిన రెండు రోజులుగా జనం 'చలి'గింతలకు గురవుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలకు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గడిచిన వారం రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. దీంతో చలిప్రభావం ఒక్కసారిగా పెరిగింది. ఉమ్మడి జిల్లా అంతటా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. అనూహ్యంగా పడిపోయిన ఉష్ణోగ్రతలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయాయి. మంగళవారం నాడు గరిష్టం 29.9 కాగా కనిష్టం 16.5 డిగ్రీలు నమోదు అయ్యింది. రాత్రి నుంచి ఉదయం 7 గంటల వరకు శీతలగాలులు వీస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కప్పుకుంటోంది. ఈ నెల మొదటి, రెండు వారాల్లో వర్షాలు అన్ని మండలాల్లోనూ కురిశాయి. వర్షాల అలా తగ్గగానే చలి మొదలైంది. రాత్రి 7 గంటలు దాటిన తరువాత చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. చలితీవ్రత పెరగడంతో జనం గజగజ వణకాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు సంవృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది. ఇప్పటికీ కొన్ని వంకలు, వాగులు నీటితో ప్రవహిస్తున్నాయి. వీటి రిత్యా కూడా చలి తీవ్రత పెరిగిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతూ వస్తున్నాయి. మంగళవారం నాడు చలి తీవ్రత మరింత పెరిగింది. ఆకాశం మేఘావృతం అయ్యి ఉండడంతో మధ్యాహ్న సమయంలో కూడా చలి ప్రభావం కన్పించింది. గాలిలో తేమ శాతం పెరగడంతో రాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు తగ్గడం లేదు. దీంతో ప్రజలు బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చలితీవ్రతతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. చలి పెరుగుతున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మరింత పెరిగే అవకాశం.. జాగ్రత్తలు పాటించాలి...

నవంబర్ నెల ప్రారంభం నుంచి చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక జబ్బులున్న వారు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. చలిగాలులు ఎక్కువగాఉండే సమయంలో ప్రయాణం చేయడం మంచి కాదంటున్నారు. ఒకవేళ ప్రయాణాలు చేసినా చెవులను పూర్తిగా కప్పుకునే ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. చలిని తట్టుకునేలా స్వెట్టర్లు, చేతులకు గ్లౌజులు ధరిస్తే ఉత్తమం అని సూచిస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద బైటాయించి నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

రైతు, కార్మిక వ్యతిరేక పాలనపై ఐక్య ఉద్యమాలు

రైతు, కార్మిక వ్యతిరేక విధనాలను నిరసిస్తూ దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా పుట్టపర్తి జిల్లా కేంద్రంలో కార్మిక, రైతు, వ్యవసాయ, కూలీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నాను చేపట్టారు. సిఐటియు, ఎఐటియుసి ఎపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం కార్మికులు, రైతులు, కూలీలు, మహిళలు పెద్దఎత్తున గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద బైటాయించి మహాధర్నా కొనసాగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతు, కార్మికులు హాజరై మహాధర్నాను విజయవంతం చేశారు.

- కలెక్టరేట్ వద్ద మహాధర్నా విజయవంతం
- రైతులు, కార్మికులకు నష్టం చేసేలా కేంద్రం నిర్ణయాలు
- రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి
- చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి
- మహాధర్నాలో నాయకులు విమర్శనాగ్రహం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రైతులు, కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం నాడు కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు వేమయ్య యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా కార్మికుల హక్కుల కోసం జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టామన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కుదిచ్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా బిజెపి ప్రభుత్వం చేయడం కార్మికుల హక్కులను కాలరాయడమే అన్నారు. రైతు నల్ల చట్టాల రద్దు సందర్భంగా రైతాంగానికి మోడీ ఇచ్చిన హామీలు మూడేళ్ల అవుతున్నా నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తూ కార్మికుల, కర్షకులు హక్కులను కాలరాసేలా ప్రధాని మోడీ పాలన సాగుతోందన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలల అయినా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో ఒక గ్యాస్ పథకం తప్ప మిగతావి అమలు చేయలేదని విమర్శించారు. చిరు ఉద్యోగులపై కక్షకట్టి వారిని విధుల నుంచి అకారణంగా తొలగిస్తున్నారన్నారు. అధికార పార్టీ అనుకూలమైన వారిని విధుల్లోకి తీసుకుంటున్నారన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం గతంలో రద్దు చేసిన నల్ల చట్టాలని మళ్లీ అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. దేశంలో కార్మికులు కర్షకులు ప్రధాన ఉత్పాదశక్తులుగా ఉన్నారని వారిపై కక్ష కట్టి వారి హక్కులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్నా నియంత్రించలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధనాలను మానుకోకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం అవుతామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ రైతు సంఘం కార్యదర్శి బడా సుబ్బారెడ్డి, అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, శ్రామిక మహిళ కార్యదర్శి దిల్షాద్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఐద్వా కార్యదర్శి నాగమణి, శ్రావణి, సిఐటియు నాయకులు, జిఎల్.నరసింహులు, లక్ష్మీనారాయణ, రమేష్, బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్, పెదపల్లి బాబా, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, బాలకాశి, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, అశోక్, గిరి పాల్గొన్నారు.

30న నేమకల్‌కు చంద్రబాబు రాక

పర్యటనను విజయవంతం చేయండి - ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



నేమకల్లులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈ నెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామానికి రానున్నారు. పింఛన్ల పంపిణీ, గ్రామసభల కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులతో కలిసి మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం నేమకల్ వద్ద హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలలల్లోపే ముఖ్యమంత్రి పూర్తిగా వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గానికి రావడం ఇక్కడి ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. 2014-19 కాలంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కుప్పం కంటే రాయదుర్గం నియోజకవర్గానికి అత్యధిక నిధులు ఇచ్చి ఈ ప్రాంత అభివద్ధికి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారన్నారు. ఈ ప్రాంత ప్రజల అభివద్ధి, అంకితభావానికి ఐదేళ్ల కాలంలో మంజూరు చేసిన పనులు కొన్ని పూర్తికాగా, కొన్ని అర్ధాంతరంగా ఆగాయన్నారు. ఆగిన కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించడంతోపాటు కొత్తగా నియోజకవర్గానికి తీసుకురావాల్సిన అభివద్ధి కార్యక్రమాలు ఉన్నాయన్నారు. రాయదుర్గం నియోజకవర్గం సమగ్ర అభివద్ధి, సర్వతోముఖాభివద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగు, లక్ష ఎకరాల భూమికి సాగునీటి సౌకర్యం నెరవేర్చేందుకు సీఎం రాయదుర్గం నియోజకవర్గం పర్యటనను సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. కొత్త వరాలు కోరుకుని నియోజకవర్గాన్ని అభివద్ధి పథం వైపు తీసుకెళ్తానని ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు.

చిరుద్యోగుల తొలగింపులు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తొలగించిన విఒలను, మెప్మాలో పనిచేసే సిబ్బందిని హైకోర్టు ఉత్తర్వుల మేరకు విధుల్లోకి తీసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు డిఆర్‌డిఎ పీడీ నరసయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు పీడీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ఆయా మండలాల్లో పనిచేస్తున్న వివో లను యానిమేటర్లను అనధికారంగా తొలగించారని, ఇది అన్యాయమని వారిలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు వారికి సానుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఆ తీర్పు మేరకు వివో లను యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. స్పందించిన పీడీ విషయాన్ని కలెక్టర్ దృష్టికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్, కోశాధికారి సాంబశివ, విఒఎ యూనియన్ కన్వీనర్ రంగనాయక, కో కన్వీనర్ వెంకట్రాముడు, సుజాత, బైలప్ప ,అశ్విని ,మాధవి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ సబ్‌స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



సబ్‌స్టేషన్ వద్ద విద్యార్థులు

మండల పరిధిలోని జగరాజు పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా పాఠశాల విద్యార్థులు గ్రామ సమీపంలో గల 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ను సందర్శించారు. సబ్ స్టేషన్‌లో గల ట్రాన్స్‌ఫార్మర్ ఫంక్షనింగ్, ఫీడర్ బ్రేకర్స్ పనిచేసే విధానంపై సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో భారత రాజ్యాంగం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్ బాబు, ఒకేషనల్ ట్రైనర్ శ్రీనివాసులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే



రైతులకు డ్రిప్ పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - మడకశిర

రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి టిడిపి, నాయకులు, కార్యకర్తలు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హుడైతే తనమీద పోటీ చేసిన వైసిపి అభ్యర్థి కూడా ప్రభుత్వగృహం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో 15వేల ఇళ్లను మంజూరు చేసి ఇల్లు లేదని వినతిపత్రాలు రాకుండా చూడటమే ధ్యేయంగా అధికారులు, నాయకులు పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మడకశిరకు వచ్చినప్పుడు 10వేల ఇళ్లు కావాలని అభ్యర్థించగా సానుకూలంగా స్పందించిన ఆయన అర్హులైన వారికి గృహాలను మంజూరు చేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఆగలి జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్లు లక్ష్మీనారాయణ , దాసిరెడ్డి, గణేష్, మద్దనకుంటప్ప, కుమారస్వామి, మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, మీనాక్షి రామిరెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు ప్రసాద్, మాజీ జడ్‌పిటిసిలు సన్నతిమప్ప, నరసింహమూర్తి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. 90శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తున్న డ్రిప్పు పరికరాలను మంగళవారం పట్టణం లోని యాదవ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ రాజుతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల కష్టాలను ఇబ్బందులను గ్రహించి అర్హత ఉన్న ప్రతి రైతుకు సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, టిడిపి మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, గణేష్ కుమారస్వామి, మదన కొండప్ప, కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వీఎం. పాండురంగప్ప, ఎపిఎంఐసి ప్రాజెక్ట్ డైరెక్టర్, మాజీ జడ్పిటిసిలు నరసింహమూర్తి, సన్న తిమ్మప్ప, మాజీ కన్వీనర్లు శివ రుద్రప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జులు శివకుమార్, నాగరాజుతో పాటు టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

కలెక్టర్ టిఎస్. చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సోలార్ ఉత్పత్తితో వినియోగదారుడు అదనంగా ఆదాయం పొందే అవకాశం పొందే విధంగా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన ఉచిత విద్యుత్ కోసం ఉద్దేశించిన రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్ యోజన అమలుపై డిఎల్‌పి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిఎస్పీడిసిఎల్ ప్రతినిధి ఎస్‌ఇ సురేంద్రబాబు, సాంప్రదాయ ఇంధన వనరుల అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యువజన పథకాన్ని కేంద్రం ఇటీవల ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద ప్రతి ఏటా కోటి గృహాలకు సోలార్ విద్యుత్ అందించడమే లక్ష్యం అన్నారు. మన రాష్ట్రంలో రూ. 30 లక్షలలో ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందుకు జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ ఎంపిక కార్యక్రమం చేపట్టాలని అధికారులు అధికారులను ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించి గ్రామాలను ఎంపిక చేయాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాలను 100 శాతం సోలార్ విలేజ్‌లుగా మార్చాలన్నారు. సోలార్ గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల సహాయం అందిస్తుందన్నారు. ఉత్పత్తి అయిన సోలార్ విద్యుత్ లో పేద ఎస్సీ ఎస్టీ గృహాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, నైపుణ్య అభివృద్ధి అధికారి హరి కిరణ్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జాతీయ గ్రాప్లింగ్ పోటీల రెఫరీగా 'పురం' యువకుడు

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ గ్రాప్లింగ్ పోటీలు ఉత్తరాఖండ్ హరిద్వార్ లో జాతీయ స్థాయి రెజ్లింగ్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల రెఫరీగా వ్యవహరించినహిందూపురానికి చెందిన ఉసామాఖాన్‌ను గ్రాప్లింగ్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు దినేష్ కపూర్ అభినందించారు. ఈసందర్భంగా ప్రశంసా పత్రం, బహుమతిని అందజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ అసోషియేషన్ ప్రెసిడెంట్ సురేంద్ర రెడ్డి, కోచ్ శ్రీరంగరాజుపల్లి ఆర్యే రమేష్, పుర ప్రముఖులు లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్, ఖాన్ చైతన్య సంస్థ అధ్యక్షుడు గంగిరెడ్డి, చేనేత నాయకులు నాగరాజు, తదితరులు ఉసామాఖాన్‌ను అభినందించారు.

బుక్కపట్నం చెరువులో తెప్పోత్సవం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని చెరువులో లక్ష్మీనారాయణ స్వామి తెప్పోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ తిప్పోత్సవంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్థానిక చెరువులో అందంగా అలంకరించిన బోటులో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అహుడా ఛైర్మన్‌కు అభినందనలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అహుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టిసి వరుణ్‌ను జిల్లాకు చెందిన టిడిపి, జనసేన నాయకులు అభినందనలు తెలిపారు. అనంతపురంలోని ఆయన కార్యాలయంలో పుట్టపర్తి సాయి ఆరామం గంగాధర్, జనసేన నాయకుడు పూల శివప్రసాద్, తో పాటు పలువురు టిడిపి జనసేన, నాయకులి శుభాకాంక్షలు తెలిపారు.

క్షయవ్యాధి నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని యనమలపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్యసిబ్బంది టీబి వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా టీ బీ నిర్మూలన శాఖ సూపర్వైజర్ , అబీద్ బాషా ఆధ్వర్యంలో టిబి వ్యాధి వల్ల కలిగే అనర్థాలు, సోకిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ప్రజాశక్తి www.prajasakti.com

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నట్లు డిఈఓ కిష్టప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నుండి ఐదు తరగతుల విద్యార్థులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించి ఎంపిక చేయబడిన ఏడు నియోజకవర్గాలలోని ఎంపిక చేయబడిన పాఠశాలలో ఈ టెస్టులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ నరసింహ మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఎస్ఎమ్ పథకం ద్వారా పల్లెల్లో పరిశ్రమలు అభివృద్ధికి రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా వారిని అభివృద్ధి చేయడానికి సిబ్బంది సర్వే లో తీసుకోవాల్సిన విషయాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒఆర్‌డి ఆనంద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు రమేష్ బాబు, మల్లికార్జున, నాగరాజు, లక్ష్మయ్య సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

రబీ సీజన్‌లో పంట సాగు చేస్తున్న రైతులు బీమా వర్తింపునకు ప్రీమియం చెల్లించాలని ఎఒ వంశీక్రిష్ణ తెలిపారు. ప్రీమియం మొత్తాన్ని మీ సేవా కేంద్రాలు,పోస్టాఫీస్, లేదా నేరుగా ఎన్‌సిఐపి పోర్టర్ ద్వారా ఆన్ లైన్‌లో రైతులు చెల్లించవచ్చని తెలిపారు. గడువు ముగిసే లోపు ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందాలని ఎఒ సూచించారు.

నంబులపూలకుంట : రబీలో పంటలు సాగు చేయు రైతులు తమ పంటలకు బీమా చేసుకోవటానికి ప్రీమియం చెల్లించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు సనావుల్లా తెలిపారు. మండల పరిధిలోని మర్రికొమ్మదిన్నె, నంబులపూలకుంట గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో లోకేశ్వర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష, లక్ష్మీనారాయణ, విహెచ్‌ఎలు ప్రత్యూష, యుగంధర్, ధనలక్ష్మితో పాటు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ లో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్నారు. వైసిపి శ్రేణులపై దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న గొంతులను సైతం నొక్కి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడటం దారుణమన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా మహిళలు గంజాయికి బానిసలయ్యారని మంత్రి సవిత శాసన మండలిలో వ్యాఖ్యానించడం దారుణమన్నారు. తన సొంత ఊరు రాంపురం వచ్చి ఎంత మంది మహిళలు గంజాయికి బానిసలు అయ్యారో నిరూపించాలని సవాల్ విసిరారు. అలా నిరూపించలేని పక్షంలో మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పై అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న టిడిపి సోషల్ మీడియా సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఈసందర్భంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వైసీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఉషశ్రీ చరణ్

అనుమతులు లేని ఇళ్ల నిర్మాణాలను నిలిపేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోని ధర్మవరం రోడ్డు వద్ద 384 సర్వే నంబర్లో అనుమతులు లేకుండా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని తహశీల్దార్ నీలకంఠారెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో 23 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. అయితే వీరికి ప్రభుత్వం నుండి ఇంటి పట్టాలు అందకపోవడంతో పలువురు టిడిపి నాయకులు వీటిని అడ్డుకుంటున్నారు.ఈ 23 మంది లబ్ధిదారులకు పట్టాలు లేకనే రిజిస్ట్రేషన్ గతంలో ఎలా చేశారని అధికారులను వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ స్థలాల్లో 23 మంది మూడు రోజుల నుండి పునాదుల పనులు ముమ్మరంగా చేస్తుండగా రెవిన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో తహశీల్దార్ సంఘటనా స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. పునాదుల నిర్మాణాలు ఆపాలని ఉన్నత అధికారుల నుండి అనుమతులు వచ్చిన తరువాత నిర్మించుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నజీర్, వీఆర్ఏలు శివప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రామీణ మహిళలకు చేయూతనందించి వారిని ఆర్థిక పురోభివృద్ధి వైపు నడిపించడమే ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ లక్ష్యమని ఆ సంస్థ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం పరిధిలోని పెడపల్లి గ్రామంలో మంగళవారం పలువురు మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అవహాటా, స్టిట్టటంగ్ జర్మనీ వారి సహకారంతో బుక్కపట్నం, కొత్తచెరువు పుట్టపర్తి గ్రామాలకు చెందిన పిఆర్‌డిఎస్ టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం మూడో విడతలో 47 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలలో గతంలో మొదటి విడతలో 27 మందికి రెండో విడతలో పదిమందికి మోటారుతో ఉన్న మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సత్యసాయి బాబా భక్తులు దక్షిణాఫ్రికాకు చెందిన లలితా జవ హీర్ లాల్ , స్కాట్లాండ్‌కు చెందిన యాంజెలా డెక్సవ్ , హాంకాంగ్ మీరియా చేతుల మీదుగా కుట్టు మిషన్లు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డిఎస్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, పద్మావతి, భారతి, టైలరింగ్ కోచ్ వినుత, కంటి నిపుణులు డాక్టర్ బషీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న దృశ్యం

వడ్డెర సంఘం మండల కమిటీ ఏర్పాటు

తలుపుల : వడ్డెర సంఘం మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఆసంఘం కదిరి తాలూకా అధ్యక్షులు కుంచపు గంగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జెరిపిటి దేవా, ప్రధాన కార్యదర్శిగా జెరిపిటి అనిల్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా టి. రత్నమయ్య, ఉపాధ్యక్షులుగా వి. శ్రీనివాసులు, కెవి. రమణ, మాజీ ఎంపీటీసీ నారాయణ, సలహాదారులుగా ఎం. వెంకటనారాయణ, జె సూరి, బి. నారాయణను ఎన్నుకున్నారు. అదే విధంగా మండల మహిళా అధ్యక్షులుగా రామాంజులమ్మ, మహిళా ఉపాధ్యక్షులుగా దేవి, యూత్ అధ్యక్షులు గారికాపల్లి నరేష్, ఉపాధ్యక్షులుగా గంగాధర్, కార్యదర్శిగా నాగమణి, అమర్నాథ్, రామాంజి, రమణను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో వడ్డెర్ల అభివృద్ధికి కమిటీ సభ్యులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెరసంఘం జిల్లా అధ్యక్షులు ఉత్తన్న, కదిరి తాలుకా అధ్యక్షులు దేరంగుల గంగరాజు, ప్రధాన కార్యదర్శి వల్లెపు గంగరాజు, యువసేన అధ్యక్షుడు రాజేష్, వడ్డే బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో బుధవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో గల 33/11కేవీ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను బుధవారం నిలిపివేస్తున్నట్లు చెప్పారు.ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతి నగర్, మున్సిపల్ కార్యాలయం,కదిరి గేట్, చంద్రబాబు నగర్, శివనగర్, కేశవ్ నగర్, చిన్నూరు గొట్లూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్ 2 జి. వి. కొండారెడ్డి కోరారు.

వ్యక్తి అరెస్టు

కదిరి టౌన్ : ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇంటి పట్టాలు తన వద్ద పెట్టుకొని డబ్బులు డిమాండ్ చేసి జులుం ప్రదర్శించి బెదిరించిన కేసులో కదిరి రూరల్ మండలం సున్నపుగుట్ట తాండాకు చెందిన సభావాత్ సోమ్లు నాయక్ అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సోమ్లు నాయక్ వద్ద అక్రమంగా ఉన్న సుమారు 39 ఇంటి పట్టాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.నిందితుడిని కోర్టులో హాజరుపర్చి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

బావిలోపడి మహిళ మృతి

గుడిబండ : మండల పరిధిలోని కరికెర పంచాయతీ దాసరపల్లి గ్రామానికి మహిళ బావిలో పడి మృతిచెందింది. గ్రామానికి చెందిన చంద్రప్ప భార్య శిల్ప (33) మంగళవారం బావిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకొన్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మృతదేహాన్ని సందర్శించి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలు అయ్యాయి. రామగిరికి చెందిన వ్యక్తి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మొరసనపల్లికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి.గాయపడిన వారిని 108 లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

పరిగి : మండలంలోని జై మంగలి నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

పుట్టపర్తి రూరల్ :ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్ పత్రాలను పరిశీలించి, లేని వాటికి చలానాలు వేశారు. ద్విచక్ర వాహనం నడిపే వారు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎటువంటి నేరాలు జరుగకుండా ప్రజలకు అవగాహన కల్పించారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - నల్లచెరువు

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆర్థికసాయం అందజేశారు. మండలానికి చెందిన నారాయణ స్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని టిడిపి నాయకులు పివిఆర్ గణేష్, కౌలేపల్లి చంద్ర ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. నారాయణస్వామి వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 50వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, పీవీఆర్ గణేశ్, కౌలేపల్లి చంద్ర, కిరణ్ కుమార్ నాయుడు, మోటుకుపల్లి మనోహర,తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మండలంలోని సిద్దరాపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే నల్లమాడ మండలం దొన్నికోట గ్రామానికి చెందిన పెద్దప్ప నాయుడు అదే ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం వైద్య ఖర్చులకు ఆయన బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ, తదితరులు



కదిరి హరీష్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



బత్తలపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్సీసెల్ నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

భారత రాజ్యాంగం ఆమోదించబడి నేటికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి జిల్లా ఎస్పీ రత్న పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్‌ఐలు మహేష్, వలి, రవికుమార్, ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, ఆర్ ఎస్‌ఐలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయము నారాయణ స్వామి, క్రిష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు. వీరు బిఆర్. అంబేద్కర్ గొప్పతం ఆయన మేదస్సు గురించి వివరించారు.

చెన్నేకొత్తపల్లి : ప్రతి భారతీయ పౌరుడు మన భారత రాజ్యాంగాన్ని చదివి, చైతన్య వంతులుగా ఎదగాలని రామిగిరి సిఐ శ్రీధర్, ఎస్‌ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలోని 44 వ జాతీయ రహదారి కూడలిలో అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ధనుశ్రీ,ఉత్సవ సొసైటీ తరపున రాచెర్ల రామకృష్ణ, దామాజిపల్లి హెచ్ గంగాధర, జె.మురళి, న్యామద్దెల డీలర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి :మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో మహిళా సర్పంచి గంగాదేవి నరసింహా మూర్తి, ఈవోఆర్డీ లక్ష్మినరసమ్మ, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నంజుండ, పద్మావతి, అమర్ సింగ్, సీనా నాయక్, వెంకటరమణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కన్వీనర్ సిద్ద లింగప్ప ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్, పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, పట్టణ అధ్యక్షులు వడ్డే సురేష్, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, రమణ, సజ్జరాయుడు, శంకర్ జనసేన నాయకులు నాగరాజు, పెయింటర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండల పరిధిలోని రేకులకుంట పాపసానపల్లి తదితర పాఠశాలల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం నాగరాజు, సి నాగరాజు, సురేష్, వెంకటేష్, హరిప్రసాద్‌తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్త చెరువులో డీఈవో, తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు.

కదిరి టౌన్: కదిరి పట్టణంలోని జైన్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యతను తెలుపుతున్న పాటను పద్యాన్ని, ప్రసంగాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు . అదే విధంగా కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ యం.యస్. కిరణ్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కదిరి పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ , శేషు, జయరాములు, రాజు సత్తి, నాగభూషణ, బాలాజీ లక్ష్మి నారాయణ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: రాజ్యాంగ దినోత్సవాన్ని మండల అధికారులు ఘనంగా జరుపుకున్నారు. తహశీల్దార్ నరేంద్ర కుమార్,ఎంపిడివో అంజినప్ప,గ్రంథాలయ శాఖ అధికారిని శాంతమ్మ మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

నల్లచెరువు : స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ ఎస్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ నాయకులు మేకల నరసింహులు, మేకల నారాయణ, ఆటో యూనియన్ అధ్యక్షులు బాబు నర్సింహులు, ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : దేశ ప్రజల సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించే సమున్నత ఆశయమే భారత రాజ్యాంగం అని ఆర్డీవో మహేష్ తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మహేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కార్యాలయ అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఎఒ ఖతిజున్‌కుబ్రా, లక్ష్మీదేవి తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా ధర్మవరం పట్టణంలో వైసిపి ఎస్‌టి సెల్ నాయకుల ఆధ్వర్యంలో కళాజ్యోతి కూడలిలో ఉన్న డాక్టర్ బి ఆర్ . అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌడప్ప, దేవరకొండ రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బత్తలపల్లి ఎస్‌సి కాలనీలోని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు చంద్రశేఖర్, గడ్డం కాశప్ప, బీదాల నారాయణస్వామి, బాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. మంగళవారం బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డియస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రామాంజినప్ప, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నరసింహులు, రామాంజనేయులు, బాబు, హనుమంతు నాయక్, రాము, నాగరాజు, పైడి రాందాస్ తులసి, లక్ష్మణ్ నాయక్ కోనాపురం అంజి, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమి, దళిత సంఘాల ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు రాజ్యాంగం పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. అంతకుముందు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగ దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. తదనంతరం సత్య సాయి జిల్లా గౌరవాధ్యక్షులు కే. భూతన్న, జిల్లా కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ రాజ్యాంగం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మూడ్ల గిరియప్ప, నరసింహమూర్తి,. సుదర్శన్, సురేష్, కదిరన్న, హనుమంతరాయప్ప, మహంతేష్, రంగనాథ్, డాక్టర్ రంగస్వామి, డాక్టర్ శివన్న, నంజప్ప, రామాంజనేయులు, పవన్ పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని నిడిగల్లు గ్రామపంచాయతీలో రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారులు మంగళవారం నిర్వహించారు.ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అమత్ సరోవర్ పని దగ్గర ఉపాధి హామీ కూలీలతో ఈ కార్యక్రమం నిర్వహించి రాజ్యాంగం పై అవగాహన కల్పించి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటాచలపతి, ఎంపీడీవో రంగారావు, ఈవోఆర్డీ విజయ శేఖర్ నాయుడు, ఏపీవో సంజీవరెడ్డి, ఈసీ అశోక్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ :నెహ్రూ యువ కేంద్ర, జిల్లా యువజన సర్వీసెస్ శాఖ, ఆన్సెట్ యువజన జాగృతి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోనిప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు, సామాజికవేత్త డాక్టర్ మదన్ కుమార్ హాజరయ్యారు. యువజన జాగృతి అధ్యక్షులు వెంకటేష్ ,కళాశాల ప్రిన్సిపల్ వెంకట ప్రసాద్, స్పేస్ కాలేజ్ కరస్పాండెంట్ ప్రశాంత్, జిల్లా యువజన సర్వీసెస్ శాఖ అసిస్టెంట్ మేనేజర్ చిగిచెర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం పరిధిలోని అన్ని పాఠశాలల్లో రాజ్యాంగం దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రమీలమ్మ, వన్నూరుప్ప, అంజి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి రాజ్యాంగం దినోత్సవం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అదే విధంగా దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు సాకే రంగనాయకులు, దళిత సంఘం నాయకులు కేశవ, రమణ, రవి, ఆదెప్ప, నాగభూషణం, ఆదినారాయణ, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : రాజకీయ న్యాయం అందరికీ అందాలనేదే రాజ్యాంగ లక్ష్యమని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షురాలు సాకే యశోద రాయుడు, మండల కన్వీనర్ మలిరెడ్డి తెలిపారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగాధర్, సామకోటి ఆదినారాయణ, మాజీ ఎంపీపీ బాలు, కళ్యాణ్, సుధీర్, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్, రెవెన్యూ సిబ్బంది, గ్రంథాలయశాఖ అధికారి మల్లికార్జున పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఆయనతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

హిందూపురం : భారతీయులందరూ రాజ్యాంగ స్ఫూర్తిని నింపుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని బాలాజీ కళాశాలలో ప్రిన్సిపల్ వీరభద్రప్ప అధ్యక్షతన న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తొలుత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విషయాలను తెలుసుకోవలసిన అవసరం ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, నవేరా మాట్లాడుతూ భారత రాజ్యాంగం లో ఉన్న అంశాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ బ్రహ్మానందరెడ్డి, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ గోపాలకృష్ణ, అధ్యాపకులు ప్రియాంక, శ్వేత, రమణ, రాజు, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు రాయుడు, గంగమ్మ, సరస్వతి, గీతమ్మ, అంజలి, రాజప్ప, రామాంజనేయులు, మల్లయ్య, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలో పలు విద్యాసంస్థల్లో, రాజకీయ, ప్రజా సంఘాల ఆద్వర్యంలో ఘనంగా 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చౌడేశ్వరికాలోనిలో ఉన్నా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు పాల్గొని విద్యార్థులకు రాజ్యాంగం గురించి వివరించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌ఎం ప్రేమలత, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మక్తర్, కృష్ణారావు, ప్రభాకర్, వసుధ, ధనలక్ష్మి , ఫమీద, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బాలయేసు, సప్తగిరి, ఎస్‌డిజిఎస్, ఎప్‌ఎస్‌పిఆర్ మహిళా డిగ్రి కళాశాలల్లో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో చి